రహదారి ఏర్పాటుకు ముందుకు వచ్చిన బిల్డర్



విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మణ్

బోరబండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలగకుండా రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని బిల్డర్ బానోతు లక్ష్మణ్ తెలిపారు. 'మార్గమధ్యంలో రేకులతో కంచె నిర్మాణం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోరబండ సైట్-3 కాలనీ నుంచి నవభారత్‌నగర్ మీదుగా మాదాపూర్, కాకతీయహిల్స్ వెళ్లే మార్గంలో రహదారి ఏర్పాటు కోసం ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. గుట్టలబేగంపేట సర్వేనెంబర్.17/2లో ఏడెకరాల స్థలానికి వివాదం ముగియడంతో రేకులతో ఫెన్సింగ్ వేశామని వెల్లడించారు. దాదాపు 15 ఏళ్లపాటు కంచె లేకపోవడంతో ఈ మార్గంలో ప్రజలు రాకపోకలు సాగించేవారన్నారు. బోరబండ ప్రాంతం నుంచి మాదాపూర్, హైటెక్ సిటీ, కాకతీయహిల్స్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి ఇబ్బంది కలుగుతున్న విషయాన్ని గుర్తించి ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలుచేసి రహదారిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే తమ స్థలంలోని 10 గుంటల స్థలాన్ని వెనక్కు జరిపి ఫెన్సింగ్ వేశామని, ప్రజల కోసం రహదారి ఏర్పాటుకు దాదాపు 1,400 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. బోరబండ నుంచి నవభారత్‌నగర్ మీదుగా ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు మాస్టర్ ప్లాన్‌లో 100 అడుగుల రహదారితో పాటు మరో రెండు మార్గాలు కూడా ఉన్నాయని తెలిపారు. తమది పట్టా భూమి అని, ధరణిలోనూ క్లియరెన్స్ ఉన్నదని అన్నారు. భూమికి సంబంధించి హైడ్రాకు లేఖ కూడా రాశామని తెలిపారు.



ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన దాసోజు శ్రవణ్‌కుమార్‌కు అభినందనలు చెబుతున్న మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్‌యాదవ్ తదితరులు
● బేగంపేట, ఆంధ్రజ్యోతి



బన్సీలాల్‌పేట డివిజన్‌కు చెందిన 9 మందికి దళితరత్న అవార్డులను ప్రదానం చేశారు. వీరిని తన కార్యాలయంలో అభినందిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
● బేగంపేట, ఆంధ్రజ్యోతి



కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ కేసులు పెట్టినందుకు నిరసనగా ఈడీ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, సికింద్రాబాద్ డీసీసీ మైనార్టీ చైర్మన్ మహ్మద్ మొహసిన్ ఖురేషి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు
● ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సత్వరమే వైద్యం అందించాలి : తలసాని

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్నప్పుడు సత్వరమే వైద్యం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. రాంగోపాల్‌పేటలోని సి లైన్ దర్గా బస్తీకి చెందిన భాగ్యలక్ష్మి కొంతకాలంగా మోకాలి నొప్పితో బాధపడుతుండగా ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. దీంతో సహాయం కోసం ఎమ్మెల్యే తలసానిని ఆశ్రయించారు. వీరికి సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కు మంజూరైంది. అదే విధంగా, బేగంపేటలోని పాటిగడ్డకు చెందిన సాజిదాబేగం చికిత్స కోసం 75 వేల చెక్కు మంజూరైంది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, బీఆర్ఎస్ నేత టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



వెంకటేష్ యాదవ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న మల్లిఖార్జున్ యాదవ్

యాదవ సంఘం అధ్యక్షుడి నియామకం

ఖైరతాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్(జాంబాగ్) యాదవసంఘం ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మంగళారపు మల్లిఖార్జున్ యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు గ్రేటర్ అధ్యక్షుడు బోయిని వెంకటేష్ యాదవ్, చైర్మన్ చిట్టబోయిన నందకిషోర్ యాదవ్ జాంబాగ్‌లోని కార్యాలయంలో మల్లిఖార్జున్‌కు బుధవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ యాదవ్ మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని యాదవులందరినీ సమైక్యపరిచి డివిజన్ల వారీగా కమిటీలు వేసి సమస్యలపై పోరాడుతామని తెలిపారు. యాదవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



పూజలు చేస్తున్న డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి, ఈవో లావణ్య తదితరులు

శ్రీ సిద్ధి గణపతి ఆలయం అభివృద్ధికి కృషి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎంతో విశిష్టత కలిగిన గణేష్ గడ్డలోని శ్రీ సిద్ధి గణపతి ఆలయం అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని వినియోగదారుల హక్కుల ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సంకట చతుర్థిని పురస్కరించుకొని ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

డా. నీలా శ్రీధర్‌కు పురస్కారం



రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవి ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్‌కు దాసరి ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు దాసరి ఫిలిం అవార్డు ఫౌండర్ చైర్మన్ తుమ్మనపల్లి రామ సత్యనారాయణ బుధవారం ప్రకటించారు. 35 సంవత్సరాలుగా సాహితీ, సాంస్కృతిక, సమాజ సేవలో నీలా శ్రీధర్ అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశామని తెలిపారు. ఈ అవార్డును మే 1న నగరంలోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రదానం చేస్తామన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

చలివేంద్రం ప్రారంభం

చందానగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. చందానగర్ డివిజన్ పీజేఆర్ స్టేడియంలో బుధవారం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో ఎండలు మండుతున్నాయని, బాటసారులు, క్రీడాకారుల దాహార్తిని తీర్చేందుకు స్టేడియంలో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పదేళ్ల నుంచి ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్, శాంతిభూషన్‌రెడ్డి, మారం ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోతినగర్‌లో తాగునీరు రోడ్డుపాలు

పట్టించుకోని జలమండలి అధికారులు

మోతినగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవికాలం.. అందులో నీటి కష్టాలతో జనం ఒకపక్క అల్లాడిపోతుంటే మరోపక్క జలమండలి అధికారులు నీటి వినియోగం, పంపిణీ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వేలాది లీటర్ల తాగునీరు రోడ్డుపాలవుతున్నాయి.

మోతినగర్ ప్రధాన కూడలి వద్ద గడిచిన ఆరు నెలల నుంచి రెండు రోజులకు ఒకసారి తాగునీటి పైపులైన్ నుంచి నీరు లీకవుతుంది. సుమారు రెండు కిలోమీటర్ల దూరం రోడ్డు పొడవునా నీరు ప్రవహించి డ్రైనేజీ నాలాలో కలుస్తుంది. అసలే నీటి సమస్యతో నగర ప్రజలు అల్లాడుతుంటే నీటి వినియోగం విషయంలో శ్రీరంగనీతులు చెప్పే జలమండలి అధికారులు వారి వంతు వచ్చేసరికి అవేవీ పట్టించుకోకుండా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల తీరుపై ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు స్పందించి మోతినగర్ కూడలిలో వృథాగా పోతున్న తాగునీటిని కట్టడి చేసి ప్రజలకు వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న తాగునీరు



తాగునీటి పైపులైన్ నుంచి మ్యాన్‌హోల్ ద్వారా బయటకు వస్తున్న తాగునీరు

క్వారీస్థలం పరిరక్షణకు చర్యలు: కలెక్టర్



ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



క్వారీస్థలంలో నిర్మించిన ఇంటిని కూలుస్తున్న రెవెన్యూ సిబ్బంది

బోరబండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. వడ్డెరలకు చెందిన క్వారీస్థలం ఆక్రమణలకు గురవుతున్నదని స్థానిక వడ్డెర ఐక్యవేదిక నాయకుడు వేముల యాదయ్య కోర్టులో కేసు వేసిన సందర్భంగా సికింద్రాబాద్ ఆర్డీఓ వి.సాయిరామ్, ఖైరతాబాద్ తహసీల్దార్ ఎం.డి.నయాముద్దీన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డితో కలిసి క్వారీస్థలాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. 9.2 ఎకరాల క్వారీస్థలంలో కొంతమేరకు ఆక్రమణకు గురైందని ఆయన చెప్పారు. మిగిలిన స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు, పార్కు నిర్మాణం చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. క్వారీస్థలంలో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను కూల్చాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది రెండు ఇళ్లను కూల్చివేశారు. మండల సర్వేయర్ భీమ్లా నాయక్, చైన్‌మన్ షేక్ మెహతాబ్ తదితరులు పాల్గొన్నారు.



దాసారంబస్తీలోని గుడిసెవాసులతో మాట్లాడుతున్న నీలిమ

గుడిసెవాసులను బెదిరించడం దారుణం

● సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా పనులు చేయడంతో పాటు రౌడీషీటర్లు తిష్ట వేసి గుడిసెవాసులను ఖాళీ చేయాలని బెదిరించడం దారుణమని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. కొన్నిరోజులుగా సనత్‌నగర్‌లోని దాసారం బస్తీలో గుడిసెలు ఉన్న స్థలంలో కొందరు అక్రమంగా రేకులతో ఫెన్సింగ్ చేయడం వివాదంగా మారింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నీలిమ బుధవారం పార్టీ నేతలతో కలిసి బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. 40 సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నామని మహిళలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. గుడిసెలు ఖాళీ చేసి వెళ్లి పోవాలని రౌడీలు ఇక్కడే తిష్ట వేసి బెదిరిస్తున్నారని పలువురు మహిళలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సనత్‌నగర్‌లో ప్రజలను బెదిరించే రోజులు పోయాయని, ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రజలకు న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యటన

దాసారం బస్తీలోని ఖాళీ స్థలంలో రేకులతో నిర్మించిన ఫెన్సింగ్‌ను అమీర్‌పేట మండల రెవెన్యూ, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సందర్శించారు. రేకుల ఫెన్సింగ్ వేసిన వారిని పిలిచి మాట్లాడారు. స్థలం చుట్టూ నిర్మిస్తున్న రేకుల ఫెన్సింగ్‌కు అనుమతులు ఉన్నాయా? అని ప్రశ్నించడంతో పాటు అనుమతి పత్రాలను చూపించాలని అక్కడ ఉన్న వారిని కోరగా, అందుకు వారు నిరాకరించారు. ఫెన్సింగ్ కోసం జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పత్రాలు లేకుంటే రేకులను తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు.

నామినేటెడ్ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

బోరబండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులతో పాటు స్థానికసంస్థల ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు కోరారు. రహ్మత్‌నగర్ కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. బూత్ స్థాయి, బ్లాక్ స్థాయిలో మహిళల ప్రాధాన్యతను పెంచి పార్టీని బలోపేతం చేసేందుకు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై ఈడీ దాడులను ఖండించారు. జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ నినాదాలతో ముందుకు వెళ్తామన్నారు. సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుస్తకాల కవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు రేఖా బోయపల్లి, ప్రధాన కార్యదర్శి కోయ నాగమణిరెడ్డి కార్యదర్శి గౌరీ పెద్దపూడి, జూబ్లీహిల్స్ నియోజకవర్గం బాధ్యులు చక్ర జ్యోతి పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న రవికుమార్

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

● శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్

గచ్చిబౌలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నామని శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు 'గావ్ చలో-బస్తీ చలో' పేరుతో బస్తీలలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని ప్రజల్లో తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా లింగంపల్లి, ఆల్విన్‌కాలనీ డివిజన్లలో బుధవారం పర్యటించామన్నారు. బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, శ్మశానవాటికలు, పాఠశాలలు, ఆలయాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అపరిశుభ్రతకు నిలయంగా మారిందని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్, వక్ఫ్ సవరణ చట్టం, ట్యాక్స్ పరిమితి రూ.12 లక్షలకు పెంపు వంటి కార్యక్రమాను ప్రజలకు వివరిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. బస్తీ బాట సందర్భంగా డివిజన్ అధ్యక్షులు వారి ఇళ్ల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించడం, దళిత నాయకుల ఇళ్లలో భోజనాలు చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి

గచ్చిబౌలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో వైద్యులు రక్తదానం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం చాలా అవసరమని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ చంద్రకృష్ణ, ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని మహిళ మృతి

మోతినగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకర్ ఢీకొని వివాహిత మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన శ్రీకాంత్ కుటుంబం నగరంలోని బోరబండ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరు హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సమయంలో పర్వత్‌నగర్ నుంచి హైటెక్ సిటీ వైపునకు భార్యాభర్తలు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. సరిగ్గా సైబర్ టవర్స్ వద్దకు వచ్చేసరికి అదే మార్గాన అతివేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ లారీ వచ్చి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం వెనక కూర్చున్న మనీషా కుమారి రోడ్డుపై పడిపోగా ట్యాంకర్ టైర్ ఆమె శరీరం మీద నుంచి వెళ్లడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దళితరత్న అవార్డు గ్రహీతలను అభినందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అవార్డు గ్రహీతలకు అభినందనలు : ఎమ్మెల్యే

మారేడుపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దళితరత్న అవార్డు గ్రహీతలను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన 9 మంది దళిత రత్న అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలు బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అవార్డు గ్రహీతలను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ బాబు, నాయకులు లక్ష్మీపతి, కుర్మ మహేందర్, రాపాక అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసిన నూతనంగా ఎన్నికైన లక్ష్మినగర్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు అశోక్ తదితరులు

మర్యాద పూర్వక కలయిక

అడ్డగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడుపల్లి లక్ష్మినగర్ డెవలప్‌మెంట్ కమిటీకి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి శివానంద్, ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్, సంయుక్త కార్యదర్శులు పద్మావతి, యాదగిరి, రాజు, రోహిత్, హరీష్‌లు బుధవారం తుకారాంగేట్‌లోని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలుపుతూ లక్ష్మినగర్‌బస్తీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.

శివకుమార్‌కు దళితరత్న అవార్డు



శివకుమార్

అడ్డగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : లాలాగూడ శాంతినగర్‌కు చెందిన దొమ్మాటి శివకుమార్‌కు దళితరత్న అవార్డు లభించింది. తెలంగాణ ప్రభుత్వం, ఎస్సీ షెడ్యూల్ కులాల సంయుక్తంగా నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు దళితరత్న అవార్డు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ దళితజాతి కోసం కృషి చేస్తున్నవారికి దళితరత్న అవార్డులు ఇవ్వడం, తనకు దళితరత్న అవార్డు రావడంపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

క్రైమ్ సమాచారం

గంజాయి మత్తులో వ్యక్తిపై దాడి

అడ్డగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లో గంజాయి మత్తులో సాయి, అతని అనుచరులు బుధవారం రాత్రి హల్‌చల్ సృష్టించారు. రద్దీగా ఉండే రెజిమెంటల్ బజార్‌లో సాయి మరో నలుగురు యువకులతో కలిసి గంజాయి మత్తులో బుధవారం రాత్రి అటుగా వస్తున్న ఓ వ్యక్తితో గొడవకు దిగారు. అనంతరం ఐదుగురూ ఆ వ్యక్తిపై బండరాళ్లు, కత్తులతో విచక్షణ రహితంగా దాడిచేయడంతో తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. గాయపడ్డ వ్యక్తిని స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఆస్పత్రికి చేరుకొని గాయపడిన వ్యక్తి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ వ్యక్తికి 19 కుట్లు పడినట్లు గాంధీ వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన వారికోసం గోపాలపురం పోలీసులు గాలిస్తున్నారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియలేదని, అతడు మాట్లాడితే వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం



గొల్ల రేణు

బౌద్ధనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఓ యువతి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం సీతాఫల్‌మండికి చెందిన గొల్ల రేణు(20) నారాయణగూడలో ఓ కాలేజీలో చదువుతోంది. 15న ఉదయం 9 గంటలకు పరీక్ష రాయడానికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన రేణు తిరిగి ఇంటికి రాలేదు. ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. రేణు కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తన కుమార్తె కనిపించడంలేదని రేణు తల్లి లలిత మంగళవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయానికి వెళ్లి యువతి..



రక్షిత

బౌద్ధనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మెట్టుగూడకు చెందిన ఎం.రక్షిత(22) ఎంబీఏ విద్యార్థిని. 15న సాయంత్రం రక్షిత ఆలయానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో యువతి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. తన కుమార్తె కనిపించడంలేదని తండ్రి ఎం.రాము మంగళవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీకి వెళ్లిన విద్యార్థిని..



భాను

బౌద్ధనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాలేజీకి వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం చిలకలగూడ దూద్‌బావికి చెందిన కాలివాల భాను(20) పద్మారావునగర్‌లో ఓ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. 15న ఉదయం 9 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని ఇంటిలో చెప్పి వెళ్లింది. సాయంత్రం మూడు గంటలకు తల్లి కుమార్తెకు ఫోన్ చేయగా స్నేహితులతో షాపింగ్‌కు వచ్చానని తెలిపింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తన కుమార్తె కనిపించడంలేదని తల్లి కె.తారాబాయి మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి



గుర్తుతెలియని మహిళ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఘటన మేడ్చల్ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఎస్సై మాజీద్ వివరాల ప్రకారం మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తుతెలియని 45 ఏళ్ల మహిళ రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని బలమైన గాయాలతో పడి ఉంది. లోకో పైలెట్ అందించిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి వివరాలు తెలియరాలేదని, మహిళను గుర్తు పడితే 7812658581 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మండుటెండలో ప్రయాణికులు

● తుకారాంగేట్, అడ్డగుట్టల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి



తుకారాంగేట్ చౌరస్తాలో లేని బస్ షెల్టర్

అడ్డగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌కు నలభై ఏళ్ల చరిత్ర ఉంది. ఇప్పటివరకు ఎక్కడా కూడా బస్ షెల్టర్లు నిర్మించిన దాఖలాలు తక్కువ. దీంతో ప్రయాణికులు రోడ్లపైనే బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై స్థానిక నేతలు, ఆర్టీసీ అధికారులకు బస్తీవాసులు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. డివిజన్‌లో అడ్డగుట్ట చౌరస్తాలో బస్టాప్‌తోపాటు తుకారాంగేట్ చౌరస్తా, చంద్రయ్య హోటల్ వద్ద మూడు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు ఆగుతాయి. ప్రధాన కూడళ్ల వద్ద బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు ఎండకు ఎండి వానకు తడిసినా ఈ ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులు బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలన్న విషయాన్ని మర్చిపోయారు. అతిపెద్ద మురికివాడగా పేరున్న అడ్డగుట్ట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారి సంఖ్య వేలల్లోనే ఉంటుంది. ఉదయం విద్యార్థులతో పాటు ఉద్యోగాలకు వెళ్లేవారు బస్సు వచ్చేంత వరకు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తోంది. తుకారాంగేట్ బస్టాప్ నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు 38 ఈఎక్స్, తుకారాంగేట్ నుంచి నాంపల్లి వెళ్లేందుకు 38టి బస్సులు నడుస్తున్నప్పటికి ప్రయాణికులు బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కావడంతో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు బస్టాప్ దగ్గర్లోని దుకాణాల ముందు నీడ కింద తల దాచుకుంటున్నారు. తుకారాంగేట్ చౌరస్తాలో ఆరేళ్ల క్రితం లాలాపేట్ లయన్స్ క్లబ్ నిర్వాహకులు కొందరు తుకారాంగేట్ చౌరస్తాలో బస్‌షెల్టర్ నిర్మిద్దామని ముందుకువస్తే అక్కడ ఉండే స్థానిక నాయకుడు ఒకరు అడ్డుకోవడంతో లయన్స్ క్లబ్ నిర్వాహకులు బస్ షెల్టర్ ఏర్పాటును విరమించుకున్నారు. అప్పటి నుంచి ఇక్కడ బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసేందుకు ఏ ఒక్క స్వచ్ఛంద సంస్థలూ ముందుకు రావడంలేదు. మండుటెండల్లో బస్టాపులో నిలబడాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డగుట్ట తుకారాంగేట్ చరిత్రలో ఇప్పటి వరకు బస్టాపుల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నాయకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

● అడ్డగుట్ట ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో రోజువారీ కూలీల కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే చంద్రయ్య హోటల్ రోడ్డుపైనే బస్సుల కోసం నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బస్టాప్‌లు లేకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. బస్టాప్‌లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు బస్‌పాస్ ఉండడంతో తప్పనిసరిగా బస్సుల్లో వెళ్ళాల్సిన పరిస్థితి. దీంతో వారు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.



అడ్డగుట్ట బస్టాప్‌లో లేని బస్ షెల్టర్



తుకారాంగేట్ రియో పాయింట్ వద్ద లేని బస్టాప్‌లో బస్ షెల్టర్

బస్ షెల్టర్ నిర్మించాలి



తుకారాంగేట్ చౌరస్తా, అడ్డగుట్ట చౌరస్తా, చంద్రయ్య హోటల్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై స్థలం ఉన్నప్పటికి బస్టాపులో బస్ షెల్టర్లను నిర్మించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారు. ఇక్కడ బస్టాపులో బస్ షెల్టర్లు ఏర్పాటుచేయాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.

- అల్లం సునీల్

పట్టించుకోని అధికారులు



తుకారాంగేట్, అడ్డగుట్టలో బస్ షెల్టర్లు నిర్మించాలని కంటోన్మెంట్, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. తుకారాంగేట్‌లో బస్టాప్ లేకపోవడంతో స్కూలు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- నర్సింగ్ రావు, బీజేపీ

రోడ్డుపైనే ఎదురుచూపులు



అడ్డగుట్ట నుంచి వివిధ ప్రాంతాలకు కూలీ పనులకు వెళుతుంటారు. ఇక్కడ బస్టాప్, బస్‌షెల్టర్ లేకపోవడంతో రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో సర్వే చేసి ఎక్కడైతే బస్టాప్, బస్ షెల్టర్ అవసరం ఉందో అక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- సౌందర్య, బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు

న్యాయం జరిగేలా కృషి చేస్తా : ఎమ్మెల్యే



ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్టపోతున్న ముస్లిం దర్గాలు, మసీదుల బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయినపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్టపోతున్న ముస్లిం దర్గాలు, మసీదుల నిర్వాహక బాధితులతో కంటోన్మెంట్ శాసనసభ్యులు ఎన్.శ్రీగణేష్ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంతంలో కారిడార్ నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, గత ప్రభుత్వ హయాంలో సాధ్యం కాలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం నాయకత్వంలో కేవలం 10 నెలల్లోనే కేంద్రంతో మాట్లాడి డిఫెన్స్ లాండ్స్‌ను బదలాయించుకొని ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేయడం జరిగిందన్నారు. అయితే కారిడార్ నిర్మాణం కోసం ప్రైవేట్ ఆస్తులతో పాటు ప్రార్థనా స్థలాలు కూడా కొంత నష్టపోతున్నాయని, అభివృద్ధి అనివార్యమైన నేపథ్యంలో కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులతో మాట్లాడి ప్రార్థనా మందిరాలు నష్టపోకుండా చూస్తామని అన్నారు. తప్పని పరిస్థితుల్లో వాటికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి నూతనంగా నిర్మించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయినపల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్‌బాబు, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, బద్దం బల్వంత్‌రెడ్డి, సదా, ముస్లిం బోర్డు ప్రెసిడెంట్ అజ్మత్ హుస్సేన్, సిరాజ్, షకీబ్ పాల్గొన్నారు. కాగా బోయినపల్లి పోలీస్‌స్టేషన్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి వాటర్ క్యాంప్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయినపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్‌బాబు, ముప్పిడి మధుకర్‌లతో కలిసి ప్రారంభించారు.

ఘనంగా అంతర్జాతీయ నీలి గొడుగు దినోత్సవం



నీలి గొడుగు దినోత్సవం అవగాహన ర్యాలీలో పాల్గొన్న అడిషనల్ డీసీపీ అశోక్ కుమార్, సీఐ ఎస్.వెంకటేశం, సంస్థ ప్రతినిధులు

మారేడుపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలురు లైంగిక వేధింపులకు గురైనట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, పోక్సో చట్టం ఏవిధంగా మైనర్ బాలికలకు వర్తిస్తుందో అదే విధంగా బాలురకు కూడా వర్తిస్తుందని నార్త్ జోన్ అడిషనల్ డీసీపీ పగడాల అశోక్ కుమార్ తెలిపారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నీలిగొడుగు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జూబ్లీ బస్టాండ్ చౌరస్తా నుంచి డీసీపీ ఆఫీస్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మైనర్ బాలురు లైంగిక వేధింపులకు గురవుతున్నప్పటికీ ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదని, దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెల్లడించారు. నివేదికల ప్రకారం 50 శాతానికి పైగా లైంగిక వేధింపులకు గురవుతున్నా, ఫిర్యాదు చేయడంలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఈ విషయం తమ దృష్టికి తీసుకువస్తే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, మారేడుపల్లి సీఐ ఎస్.వెంకటేశం, ట్రాఫిక్ సీఐ వెంకట్ రాములు, సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు

అడ్డగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని మహబూబ్ పాఠశాలలో 2025-26కు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్కూలు ప్రిన్సిపల్ యాదగిరి తెలిపారు. ఎలాంటి డొనేషన్ చెల్లించకుండానే ఈ పాఠశాలలో చేర్పించవచ్చని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. ఈ ప్రభుత్వ పాఠశాలకు ఎందరో మహానుభావులు చదువుకున్న చరిత్ర ఉందన్నారు. 1 నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు మొదలయ్యాయని, వివరాలకు నేరుగా స్కూలుకు వచ్చి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9908610452 ఫోన్‌చేసి ప్రిన్సిపల్ నుంచి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

పాఠశాలలో ఉచితంగా బేసిక్ కోచింగ్

అడ్డగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు వేసవి సెలవుల్లో అడ్డగుట్ట ప్రభుత్వ ప్రైమరీ బడిలో ఉచితంగా హిందీ, ఇంగ్లీష్, తెలుగు వంటివి ఉచితంగా నేర్పిస్తున్నామని ఎంవీ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి సువర్ణ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 8 నుంచి ఉదయం 11 వరకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపల్ అనురాధ స్కూలులో నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు శిక్షణకు హజరవ్వాలని కోరారు.

డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంక్వైరీ

తిరుమలగిరి ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మండల కార్యాలయం సిబ్బంది బుధవారం తిరుమలగిరి లాల్‌బజార్‌లోని స్వీపర్‌లైన్‌లో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులను ఎంక్వయిరీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మురళీ ముదిరాజ్ పాల్గొన్నారు.

చైతన్య కుమార్‌కు గిన్నీస్ బుక్ అవార్డు

తిరుమలగిరి ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న చైతన్య కుమార్‌ను గిన్నీస్ బుక్ అవార్డు వరించింది. సంగీత వాయిద్య ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబర్చి వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించారు. కీబోర్డు ఉపయోగించి సంగీతంలో మంచి ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని హలేలు మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నీస్ రికార్డు సాధనలో గంటసేపు 1090మంది వివిధ పాటలను కీబోర్డుపై నిరవధికంగా వాయించగా 1049మంది ఎంపికయ్యారు. అందులో చైతన్య కుమార్ ఒక్కరు. ఆయనకు గిన్నీస్ బుక్ అవార్డు లభించింది.

గుడిసెవాసులను బెదిరించడం దారుణం

● సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా.కోట నీలిమ

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా పనులు చేయడంతో పాటు రౌడీషీటర్లు తిష్ట వేసి గుడిసెవాసులను ఖాళీ చేయాలని బెదిరించడం దారుణమని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. కొన్నిరోజులుగా సనత్‌నగర్‌లోని దాసారం బస్తీలో గుడిసెలు ఉన్న స్థలంలో కొందరు అక్రమంగా రేకులతో ఫెన్సింగ్ చేయడం వివాదంగా మారింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నీలిమ బుధవారం పార్టీ నేతలతో కలిసి బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. 40 సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నామని మహిళలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. గుడిసెలు ఖాళీ చేసి వెళ్లి పోవాలని రౌడీలు ఇక్కడే తిష్ట వేసి బెదిరిస్తున్నారని పలువురు మహిళలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలను బెదిరించే రోజులు పోయాయని, ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రజలకు న్యాయం చేస్తానని పేర్కొన్నారు.



దాసారంబస్తీలోని గుడిసెవాసులతో మాట్లాడుతున్న నీలిమ

● రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యటన

దాసారంబస్తీలోని ఖాళీ స్థలంలో రేకులతో నిర్మించిన ఫెన్సింగ్‌ను అమీర్‌పేట మండల రెవెన్యూ, జీహెచ్ఎంసీ ఖైతరాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సందర్శించారు. రేకుల ఫెన్సింగ్ వేసిన వారిని పిలిచి మాట్లాడారు. స్థలం చుట్టూ నిర్మిస్తున్న రేకుల ఫెన్సింగ్‌కు అనుమతులు ఉన్నాయా? అని ప్రశ్నించడంతో పాటు అనుమతి పత్రాలను చూపించాలని అక్కడ ఉన్న వారిని కోరగా, అందుకు వారు నిరాకరించారు. ఫెన్సింగ్ కోసం జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పత్రాలు లేకుంటే రేకులను తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు.



లబ్ధిదారునికి సీఎం సహాయనిధి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నేత శ్రీహరి

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ పత్రాల అందజేత

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యపరమైన సమస్యలు ఏర్పడినప్పుడు సత్వరమే వైద్యం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఇరువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఒక లక్ష 75వేల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు పత్రాలను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తలసాని అందజేశారు. రాంగోపాల్‌పేటలోని సీలైన్ దర్గా బస్తీకి చెందిన భాగ్యలక్ష్మి కొంత కాలంగా మోకాలి నొప్పితో బాధపడుతుండగా ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. దీంతో వారు ఎమ్మెల్యేను ఆశ్రయించగా ఆయన స్పందించి సీ.ఎం సహాయ నిధి నుంచి లక్ష రుపాయల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. అదేవిధంగా బేగంపేటలోని పాటిగడ్డకు చెందిన సాజిదాబేగం చికిత్స కోసం రూ.75 వేల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణ గౌడ్, బీఆర్ఎస్ నేతలు టి. శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో కార్యకర్తలు

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

పద్మారావునగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ సమావేశాన్ని బుధవారం పద్మారావునగర్‌లోని బిల్వర్డ్ గార్డెన్‌లో నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి జి.పవన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. కార్యకర్తలు భారీఎత్తున వరంగల్ సభకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజు, మహేష్, పుష్పంత్ రెడ్డి, జగ్గయ్య, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన కానిస్టేబుల్‌కు సన్మానం

పదోన్నతి పొందిన పోలీసులకు సన్మానం

తిరుమలగిరి ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పదోన్నతి పొందిన సందర్భంగా వారిని బుధవారం నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సత్కరించి అభినందనలు తెలియజేశారు. డేవిడ్ రాజు ఏఎస్ఐగా, కానిస్టేబుల్స్ పవన్ ప్రసాద్, తిరుపతిలు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు పొందారు. ఏసీపీ ముగ్గురిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇదేవిధంగా ఉద్యోగమే పరమావధిగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మధు బాబు, ఎస్సై శ్రీకాంత్ , సిబ్బంది పాల్గొన్నారు.

అభినందనలు



ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన దాసోజు శ్రవణ్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్‌యాదవ్ తదితరులు

- బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి)